

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**లపక్ ఝపక్...**

**లపక్, ఝపక్ తూ ఆరె బదర్ వా**

**సర్‌కి ఖేతీ సూఖ్‌రహీహై**

**బరస్ బరస్ తూ ఆరె బదర్‌వా**

'బూట్ పాలిష్' సినిమాలో మన్నాడే పాడిన ఈ పాట మన సినిమాలలో హాస్య పాటలకు తలమానికం లాంటిది. అంతకు ముందూ హాస్య గీతాలున్నాయి. ఆ తరువాత హాస్య గీతాలున్నాయి. ఇంకా ఎన్నో హాస్యగీతాలను మన సినీకళాకారులు సృజిస్తారు. కానీ ఈ హాస్య గీతం పుట్టుకనుంచీ ప్రత్యేకత కలిగిన గీతం.

మన సినిమాల్లో హాస్యం కోసం ప్రత్యేకంగా నటీనటులుంటారు. వారికోసం సినిమాతో సంబంధం లేకుండా, సమాంతరంగా సినిమాలో సినిమా ఉంటుంది. కొన్ని సందర్భాలలో సినిమాలో భాగంగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో హాస్యనటుడితో సమానంగా హీరో హీరోయిన్లు కామెడీ సృష్టిస్తారు. ఏది ఏమైనా 'పాట' హాస్యం సృజించటంలో ప్రధాన పాత్ర వహిస్తుంది. చాలా తక్కువ సినిమాల్లో హాస్యం కోసం సృజించిన పాట సినిమాలో అంతర్భాగమై కథను ముందుకు తీసుకు వెళ్తుంది. అలాంటి అరుదైన పాట ఇది.

హాస్యం అంటే ఏమిటి? హాస్యానికి నిర్వచనం ఏమిటి? అన్నవి కఠినమైన ప్రశ్నలు. ఒకరి హాస్యం, మరొకరికి విషాదం. హాస్యం సృష్టించాలంటే ఎవరో ఒకరిని వెక్కిరించటమో, హేళన చేయటమో, ఏడిపించటమో తప్పదా? అసలు హాస్యం అంటే ఏమిటి? అది ఎలా సృష్టిస్తారు? చాలా గంభీరమైన తాత్వికమైన ప్రశ్న ఇది. ఈ ప్రశ్నకు సమాధానంగా బోలెడు పుస్తకాలు రాశారు. కానీ సంతృప్తికరమైన సమాధానం లేదు. కానీ ప్రపంచంలో అత్యంత సుందరమైనది నవ్వు. పసిపిల్లవాడి నవ్వు, పూలనవ్వు, ప్రేయసి చిరునవ్వు, తల్లి నవ్వు. ఇలా ప్రపంచంలో హాస్యానికి గుర్తింపు అయిన నవ్వుని మించిన అందమైనది ఏదీలేదు. అయితే 'నవ్వు నవ్వుకు తేడా ఉంటుంది. నవ్వే అదృష్టం ఎందరికి ఉంటుంది? ' అంటాడు దాశరథి. ఇది నిజం. ప్రతి నవ్వు వెనుక హాస్యం ఉండదు. సంతోషం ఉండదు. కొన్ని నవ్వుల వెనుక విషాదం దాగి

ఉంటుంది. వేదన తొణుకుతూంటుంది. 'తుం ఇత్‌న జో ముస్కురారహేహో, క్యా గం హై జిస్‌కో ఛుపారహేహో' అంటాడు కైఫీ ఆజ్మీ, విషాదాన్ని నవ్వు వెనుక దాచే నాయిక ప్రయత్నాలలోని డొల్లతనాన్ని ఎత్తి చూపిస్తూ.

**ఆఖోంమేనమీ, హసీలబోం పర్**

**క్యాహాల్ హై , క్యా దిఖారహేహో**

**క్యా గం హై జిస్ కో ఛుపారహేహో...**

కళ్లల్లో చెమ్మ, పెదవులపై చిరునవ్వు, పైకి చూపిస్తున్నదేమిటి? అసలు నిజం ఏమిటి? ఏ వేదనను దాచి పెడుతున్నావు? అని అడుగుతాడు నాయకుడు. అద్భుతమైన గజల్ ఇది. 'విషాదాన్ని దాచే నవ్వు' హాస్యానికి ప్రతీక కాదు. జగ్జీత్ సింగ్ స్వరంలో తొణికిసలాడే జాలి, ప్రేమ, వేదన భావనలు శ్రోతను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అప్పుడూ పెదవులపై చిరునవ్వు మొలుస్తుంది.

**హస్ నె కీ చాహ్‌నె, ఇతనా ముఝే రులాయా హై**

అంటాడు 'కపిల్‌కుమార్' మన్నాడే స్వరంలో 'ఆవిష్కార్' సినిమా కోసం. అంటే సంతోషంగా ఉండాలన్న కోరిక అతడిని ఎంతగానో ఏడ్పించిందంట. ఇక 'హస్ నెకీ ' చాహ్( కోరిక)' నవ్వాలనే కోరిక'గా అర్థం చేసుకోకూడదు. సంతోషంగా ఉండాలన్న అభిలాషగా గ్రహించాలి.

'సుఖ్ కెలియే పడె దుఖ్ భీ సహెనా' అంటాడు శైలీ శైలేంద్ర ఘర్ సినిమాలో భూపేంద్ర స్వరంలో. సుఖ్ కీ హై చాహ్ తో, దుఖ్ భీ సహెనా హై అంటాడు ఆనంద్ బక్షి, కిషోర్ కుమార్ స్వరంలో 'హరే రామ హరే కృష్ణ' సినిమాలో. అంటే సుఖం కావాలంటే దుఃఖాన్ని కూడా భరించాలి. అంటే, నవ్వు హాస్యాన్ని, విషాదాన్నే కాదు, సుఖాన్నీ చూస్తుంది. సంతృప్తినీ సూచిస్తుంది. అందుకే 'నవ్వు నవ్వుకూ తేడా ఉంటుంది. నవ్వే అదృష్టం ఎందరికుంటుంది?' అంటాడు దాశరధి. అంటే మనకు కనిపించే 'నవ్వులు' అన్నీ 'నవ్వులు' కావు.

**జిందగీ ఆజ్ మెరే నాం సె శర్మాతీహై**

**అప్‌ని హాలత్ సె ముఝె ఖుద్ భి హసీ ఆతీ హై**

అనిపిస్తాడు షకీల్ బదాయుని 'సన్ ఆఫ్ ఇండియా' సినిమాలో నాయకుడితో.

నాయకుడు ఎంతటి దయనీయమైన, దుర్భరమైన దుస్థితిలో ఉన్నాడంటే, ప్రపంచమే కాదు జీవితమే అతడిని చూసి హేళనగా నవ్వుతోంది. సిగ్గుపడుతోంది. అతడి పేరు వినేందుకే, తలచేందుకే సిగ్గుపడుతోంది. ఆ దుస్థితి చూసి అతడికే నవ్వు వస్తోంది. ఈ నవ్వు వెనుక హాస్యంలేదు. నిర్లిప్తత ఉంది.

**బచ్ పన్ కే దిన్ భులాన దేనా**

**ఆజ్ హసే, కల్ రులాన దేనా...**

షకీల్ బదాయుని 'దీదార్' సినిమాలో రాసిన పాట ఇది. ఇవాళ్ల నవ్వుతున్నాం. రేపు ఇదే మనల్ని ఏడిపించకూడదు.' అనిపిస్తున్నాడు. ప్రతి నవ్వు వెనుక 'రేపు ఏడవాల్సి వస్తుందేమో' అన్న భయం ఉంటుంది.

**హర్ ములాకాత్ క అంజాం జుదాయీ క్యూన్ హై**

**అబ్ తో హర్ వక్త్ యహీ బాత్ సతాతీ హై హమే**

'షహర్యార్' రాయగా 'తలత్ అజీజ్' భావాత్మకంగా పాడిన 'ఉమ్రావ్‌జాన్' సినిమాలోది అర్ధవంతమైన గజల్. ప్రతి కలయిక వెనుక విడిపోవటం అన్న భావన ఉంటుంది. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. కాబట్టి ప్రతి కలయిక పరమార్ధం విడిపోవటమే. కలయిక ఫలితం విడిపోవటమే ఎందుకన్న వేదన అతడిని ప్రతిక్షణం వేధిస్తున్నదట. అంటే కలయికలో ఆనందం అనుభవిస్తున్నా, ఈ కలయిక ఎప్పుడో ఒకప్పుడు అంతం అవ్వాల్సిందే అన్న భావన అంతర్లీనంగా వేదనను కలిగిస్తూంటుంది. అంటే హాస్యం వెన్నంటి విషాదం ఉంటుందన్నమాట.

'బూట్‌పాలిష్'లోని 'లపక్ ఝపక్' పాట సరిగ్గా ఈ హాస్యం వెన్నంటి ఉండే విషాదాన్ని ప్రతిబింబిస్తుంది. బూట్ పాలిష్ ను రాజ్ కపూర్ నిజానికి అతి దగ్గరగా వుండే సినిమాగా రూపొందించాలనుకున్నాడు. బూట్ పాలిష్ ను రాజ్ కపూర్ నిజానికి అతి దగ్గరగా వుండే రియలిస్టిక్ సినిమాగా రూపొందించాలనుకున్నాడు. దర్శకత్వ బాధ్యతలు 'ప్రకాశ్ అరోరా'కు అప్ప చెప్పాడు. తరువాత సినిమా తయారయ్యే వ్యవహారాలలో జోక్యం చేసుకోలేదు. సినిమా పూర్తయిన తరువాత చూసిన రాజ్ కపూర్‌కు 'బూట్ పాలిష్ ' ఆసక్తికరమైన సినిమాలా కాదు, భయంకరమైన డాక్యుమెంటరీలా తయారయిందని గ్రహించాడు. వెంటనే ఆస్థాన సంగీత దర్శకులు శంకర్ జై కిషన్‌లనూ, గేయ రచయితలు హస్రత్ జైపురి, శైలేంద్రలను పిలిచాడు. సినిమాలో పాటలకోసం సందర్భాలను సృజించాడు. ఆ సందర్భాలకు తగ్గ పాటలు రూపొందిన తరువాత వాటిని ఆయా స్థలాలో షూట్ చేసి అతికించాడు. సినిమా సూపర్ హిట్ అయింది. పాటలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. పాటలవల్ల సినిమా మరింత హిట్ అవటమే కాదు, ఈ నాటికీ మరుపురాని చిత్రంగా

మిగిలింది. ఇప్పటికీ సినిమా చూస్తే సినిమా అంతా తయారయిన తరువాత పాటలను తరువాత రూపొందించి సినిమాలో ఇరికించారు అన్నది చెపితే కానీ తెలుసుకోలేము. అంత అద్భుతంగా స్క్రిప్టును రూపొందించాడన్నమాట రాజ్‌కపూర్. అయితే, నెలలోగా తొమ్మిది అత్యద్భుతమైన పాటలను రూపొందించిన శంకర్ జై కిషన్, హస్రత్, శైలేంద్రల సృజనాత్మకత అద్భుతం. ఇదే సమయంలో వారు ఇతర సినిమాల్లోనూ పరమ రమణీయమైన గీతాలను సృజించటం గమనిస్తే కట్టలు తెంచుకుని పొంగిపొర్లే సృజనాత్మకావేశం అంటే ఏమిటో అర్థమవుతుంది. అది ఈ పాటలో మరింత స్పష్టంగా తెలుస్తుంది. ఈ పాట గొప్పతనం తెలియాలంటే సందర్భం తెలుసుకోవాలి. సాధారణంగా సినిమా పాటలు సందర్భం తెలియకున్నా బాగుంటాయి. కానీ సందర్భం తెలిసినప్పుడు పాట గొప్పతనం మరింతగా ప్రస్ఫుటమవుతుంది.

ఇద్దరు అనాథ పిల్లలు ఆంటీ దగ్గర మురికివాడలో పెరుగుతూంటారు. ఆమె వారితో బిచ్చమెత్తిస్తూంటుంది. వారికి 'ఆత్మగౌరవం' నేర్పుతుంటాడు, దొంగ సారా వ్యాపారం చేసే 'చాచా జాన్' (డేవిడ్). ఇంతలో ఓ రోజు దొంగసారా వ్యాపారం చేస్తున్నందుకు డేవిడ్ అరెస్టు అవుతాడు. జైలుకెళ్తాడు. అదే సమయానికి వాళ్ల ఆంటీ పిల్లల్ని ఇంట్లోంచి తరిమేస్తుంది. వారు ఓ గుడిసెలో ఉంటారు. ఇక్కడ జైలులో, ఎక్కడున్నా సంతోషంగా ఉండే జాన్, ఖైదీలందరినీ కూడదీసుకుని హాస్యగీతం పాడతాడు. హాస్యం ఎందుకంటే సినిమా చాలా సీరియస్‌గా సాగుతోంది కాబట్టి కాస్త రిలీఫ్ కోసం. ఎలాంటి పరిస్థితిలో ఉన్నా నవ్వుతూండే పాత్ర వ్యక్తిత్వాన్ని చెప్పటం కోసం. ఇందుకోసం శంకర్‌జైకిషన్‌లు శాస్త్రీయ సంగీతాన్ని ఎన్నుకున్నారు. సినిమాల్లో శుద్ధ శాస్త్రీయ సంగీత వాడకం అరుదు. శంకర్‌జైకిషన్‌లు పాటను శాస్త్రీయ సంగీతాన్ని ఆధారం చేసుకుని రూపొందించటం గమనిస్తే వారి సృజనాత్మకతకు జోహార్లర్పించాలనిపిస్తుంది.

పాటలో పదాలు చాలా సులభంగా అర్థమవుతాయి. పాటలో పదాలు చూస్తేనే హాస్యాన్ని పదాల ద్వారా సృజించటం తెలుస్తుంది. ఇక్కడ పాత్ర పాటలో వర్షాన్ని కురిపించమని మేఘాలను అభ్యర్థిస్తోంది. వర్షాన్ని కురిపించమనటానికి హాస్యం కలిగించే కారణాన్ని పాటలో చూపినా, అసలు కారణం పాట అయిన తరువాత తెలుస్తుంది.

జైలులో హాస్యపాట ఏముంటుంది? ఎలా సృజించటం? ఈ సమస్యకు సమాధానం సినిమాలో డేవిడ్ అరెస్టవటం, తరువాత కనబడే దృశ్యాలవల్ల దొరికి ఉంటుంది. జైల్లో ఉన్నవాడూ వర్షంకావాలని అడిగేందుకు ఓ కారణం కావాలి. అదీ హాస్యంగా

హాస్యం సాధారణంగా irrational, sillyగా అనిపించే అంశాలవల్ల కలుగుతుంది. అంశం ఎంత తర్కదూరంగా, మూర్ఖంగా ఉంటే అంతగా హాస్యం పండుతుంది. వర్షంలో గొడుగు పట్టుకునేవాడు, చెట్లకు నీళ్లు పోసేవాడు, ఎండలో స్వెట్టర్ వేసుకునేవాడు, ఇలాంటివి హాస్యం కలిగిస్తాయి. జైలులో అలాంటి హాస్యం సృజించటం

కోసం రాజ్‌కపూర్ 'దేవిడ్'నే వాడుకున్నాడు. వర్షాన్ని పంటలు పండేందుకు ఆహ్వానిస్తారు. పంటలు ఎండిపోతున్నాయి కాబట్టి, వచ్చి వర్షించమని మేఘాలను అభ్యరిస్తారు.

నీల్ గగన్ పర్ ఉడ్‌తే బాదల్ ఆ ఆ ఆ

ధూప్ మె జల్తా ఖేత్ హమారా కర్‌దే తూ ఛాయా

అంటూ, ఎండలో పంటలు మాడిపోతున్నాయి, కాస్త నీడనివ్వు అని మేఘాలను అభ్యర్థిస్తారు. కాబట్టి వర్షాన్ని ఆహ్వానించాలంటే పంటలు పండేందుకు. జైలులో ఉన్న వాడు ఏ పంటని పండేందుకు వర్షాన్ని ఆహ్వానిస్తాడు?

దేవిడ్‌ది బట్టతల. తలపై వెంట్రుకన్నది ఉండదు. తల అనే భూమిపై పండే పంట వెంట్రుకలు. ఈ పంట పండటానికి వర్షాన్ని ఆహ్వానిస్తాడు దేవిడ్. 'సర్‌కె ఖేతీ సూఖ్ రహీహై' 'తలపై పంట ఎండిపోతోంది' దానికోసం 'లపక్ ఝపక్' మేఘాలను రమ్మంటున్నాడు. తలపై పంటను పండించేందుకు వర్షాన్ని కురిపిస్తూ కురుస్తూ రమ్మంటున్నాడు. ఇక్కడ పాటకోసం సందర్భాన్ని సృష్టించిన విధానం గమనించాలి.

దేవిడ్ జైలుకి వెళ్లి బట్టతలపై పంట పండించేందుకు కురవమని అభ్యర్థిస్తూ హాస్యగీతం ఆలపించాలి. దేవిడ్ ఒక్కడికే బట్టతల ఉంటే సరిపోదు. జైలులో అతనితో ఉన్న వాళ్లకీ బట్టతల ఉండాలి. ఒకరిద్దరికీ ఉంటే సరిపోదు, అందరికీ బట్టతల ఉంటే ఇంకా హాస్యం. దాన్లో బట్టతలపై జుట్టు మొలిపించే ముందు తయారు చేసి జైలు కొచ్చిన వాడుంటే ఇంకా హాస్యం. 'ఘటా' (మేఘం) కూ 'జటా' (జుట్టు)కూ సంబంధం ఉందన్న సంభాషణ పాటకు భూమికను ఏర్పాటు చేస్తుంది. హాస్య బీజం నాటుతుంది.

ఇక్కడ శంకర్ జై కిషన్ చమత్కారం, ఒక పాట రూపొందటం వెనుక ఎన్ని రకాల ఆలోచనలు ఉంటాయో, ఎంత శ్రమ ఉంటుందో చెపుకోవాలి. ఓసారి మన్నాడే ఓ పాట రికార్డు చేసి వస్తూంటే రాజ్‌కపూర్ పిలిచాడు. ఈ 'మల్హార్' రాగం ఏమిటి? అనడిగాడు. 'వర్షం కురిపించేందుకు తాన్‌సేన్ పాడిన రాగం' అని మన్నాడే చెప్పాడు. మల్హార్ రాగ స్వరాన్ని పాడి వినిపించాడు. 'చాలా గంభీరమైన రాగం' అన్నాడు రాజ్‌కపూర్. అంటే అప్పటికి రాజ్‌కపూర్ మదిలో వర్షం కురిపించమనే పాట ఆలోచన మెదులుతోందన్నమాట.

కొన్నాళ్లకు మన్నాడేకి పిలుపు వచ్చింది. పాట సిట్టింగ్‌లో దేవిడ్ కూర్చుని ఉండటం చూసి మన్నాడే ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే దేవిడ్‌వి పాటలు పాడే పాత్రలు కావు. అప్పుడు, పాట బాణీ, పాటలో పదాలు విన్న

తరువాత మన్నాడేకు విషయం అర్ధమయింది. సీరియస్ పాత్రలు వేసే డేవిడ్ హాస్య గీతం పాడటం ప్రేక్షకుడికి మొదటి ఇర్రేషనల్ విషయం.

'లపక్, ఝపక్' పాట విన్నవారు అది రెండు రంగాల మిశ్రమమని గ్రహిస్తారు. దాన్లో మేఘ మల్హార్ రాగం. దర్బారీ కానడ రాగంతో కలిసిందని కొందరు, బహార్ రాగం దర్బారి కానడంతో కలిసిందని ఇంకొందరూ వాదించుకుంటారు. కానీ వాడిన రాగాలలో ఎలాంటి కల్తీ లేకుండా, శుద్ధ రాగాలను శాస్త్రీయ పంధాలో వాడుతూ హాస్యం కల్పించిన శంకర్‌జైకిషన్ ప్రతిభకు ఆశ్చర్యపోయి, అభినందించటంలో మాత్రం అందరూ ఏకీభవిస్తారు. ఏకమవుతారు.

మేఘ మల్హార్, బహార్ రాగాలు రెండూ అత్యంత సాన్నిహిత్యం కల రాగాలు. 'మేఘ మల్హార్' వర్షం కురిపించే రాగం అయితే, 'బహార్' రాగం వర్షం కురిసిన తరువాత వికసించే పూదోటలను ప్రతిబింబించే రాగం. అంత దగ్గర సంబంధం ఈ రెండు రాగాల నడుమ. అందుకే, వర్ధం కురిపించే రాగం, వర్షం కురిసిన తరువాత ఫలితాన్ని సూచించే రాగంతో కలిపి మేళవించారు. రెండూ గంభీరమైన రాగాలే. దర్బార్ కానడ రాగం అక్బర్ దర్బారులో పాడే రాగం. దర్బారు రాగమంటేనే గంభీరమైన రాగం. అన్ని గంభీరమైన రాగాలను కలిపి , ఏ మాత్రం రాగం చెడకుండా, నియమోల్లంఘనం కాకుండా, హాస్యాన్ని పిండేరీతిలో గీతాన్ని రూపొందించటం మామూలు పనికాదు. పాట విన్న శాస్త్రీయ సంగీత విద్వాంసులు కూడా సంగీతాన్ని అపహాస్యం చేశారు, అవహేళన చేశారు అని ఆరోపించలేదు. వారూ పాట విని నవ్వుకుని అభినందించారు. ఎక్కడా ఎవరూ ఎలాంటి దోషాన్ని ఎత్తి చూపించలేకపోయారు. అంత అద్భుతంగా శాస్త్రీయ సంగీతం మంచి హాస్యాన్ని పిండారన్నమాట శంకర్ జై కిషన్.

ఇక్కడ పాట చిత్రీకరణ గురించి చెప్పుకోవాలి. ఒకపాట చిరకాలం ప్రేక్షకుల మెదళ్లలో చిరంజీవిలా నిలవాలంటే పాట బాగుంటే సరిపొదు. సినిమాలో సందర్భం గొప్పగా ఉండాలి. సందర్భం గొప్పగా ఉంటే సరిపోదు. చిత్రీకరణ అద్భుతంగా ఉండాలి.

ఇవన్నీ కుదిరిన పాటలు చిరంజీవులుగా నిలుస్తాయి. పాట ఆరంభంలోనే డేవిడ్ పాత్ర తన ఎదురుగా ఉన్న బట్టతలపై మృదంగం లయకు అనుగుణంగా వ్రేళ్లు కదపటం హాస్యాన్ని సృష్టిస్తుంది. ఆ పై 'లపక్' అంటూ రాగం తీయటం, రాగాన్ని సాగదీయటం అంతా హాస్యం కలిగిస్తుంది. కానీ ఎక్కడా హాస్యం సృష్టించేందుకు రాగాన్ని అపహాస్యం చేయలేదు. ఇదే దృశ్యం లేకుండా, మన్నాడే స్వరంలో హాస్యం లేకుండా సీరియస్‌గా పాడితే శాస్త్రీయ సంగీతం అయిపోతుంది. అంత గొప్ప సృజన మన కళాకారులది.

పాట ఆరంభం నుంచీ తన్మయుడై, ఏదో లోకంలో ఉన్నట్టు ఓ బోసిపళ్ల వ్యక్తి కనిపిస్తూంటాడు. అతడు 1930 – 40 ప్రాంతాలలో ప్రసిద్ధుడైన దౌలత్ రాం అద్వాని. భూదో అద్వానీ అంటారతడిని. అతడు పాటలోని రాగానికి, మీండ్‌కు, ముర్కిలకు, తాన్ లకు, ఖట్కాలకు తగ్గట్టుగా ఊగిపోతూంటాడు. హఠాత్తుగా 'నాదిన్ దిన్నా' అంటూ అందుకుంటాడు. చూస్తున్న వారికి నవ్వు ఆగదు. ఇదికూడా శాస్త్రీయత ఏమాత్రం చెడని హాస్యం. ఇది పాడింది రాజ్‌కపూర్. అంటే, ఒకపాట సృజనలో రాజ్‌కపూర్ ఎంతగా మిళితమై మైమరచిపోయేవాడో ఊహించవచ్చు. అందుకే రాజ్‌కపూర్ సినిమాల్లో 'బర్సాత్' నుంచి 'రాం తెరీ గంగామైలీ' వరకు పాటలు అంతే అద్భుతంగా ఉంటాయి.

**ఝుగడ్ ఝుగడ్ కర్ పానీలాతూ**

**అకడ్ అకడ్ బిజ్‌లీ చంకాతూ**

**తేరే ఘడే మే పానీ నహీతో**

**పన్ ఘట్ సే భర్‌లా రే బదరవా!**

సామాన్యంగా ఉండే అర్థం లో , పదాలలో ఎలాంటి గొప్పతనంలేదు. కట్లు తెంచుకుని మరీ నీరు తీసుకురా, మెరుస్తూ గర్వంగా నీరు తీసుకురా, నీ కుండలో నీరు అయిపోతే నదినుంచి నీరు తీసుకురా, ఎలాంటి ప్రత్యేకత లేని ఈ పదాలు రాగంలో ఒదిగేసరికి, దృశ్యంగా చూసేసరికి హాస్యం సృజిస్తాయి. ముఖ్యంగా 'పన్ ఘట్‌సే' అంటూ రాగం మారి, మళ్లీ 'లపక్' అంటూ అసలు రాగంలోకి వచ్చేసరికి 'అద్భుతం' అనిపిస్తుంది. ఓ వైపు హాస్యం కలుగుతూన్నా మరోవైపు సంగీత దర్శకుడు, గాయకుడు కలసి చేసిన ఈ అమోఘమైన ప్రయత్నం మైమరచిపోయేంత ఆనందం కలిగిస్తుంది. ముఖ్యంగా 'పానీ' దగ్గర రాగాలు తీయటం, పానీ.. పనినీ అనటం హాస్యం కలిగించినా సర్వం శాస్త్రీయమే. ఎక్కడా నియమం తప్పలేదు.

**బస్ మె కోయల్ కూక్ ఉఠీ హై**

**సబ్ కె మన్ మె హూక్ ఉఠీ హై**

**భూదల్ సే తూ బాల్ ఉగాదే**

**ఝట్ పట్ తూ బర్సా...**

వనంలో కోయిల కూస్తోంది. అందరి హృదయాలు పరవశిస్తున్నాయి. 'హూంక్' అంటే హృదయ లోతుల్లోంచి వెలువడే నిట్టూర్పు. ఒక స్వరం. ఇలా వర్షం తెచ్చి బట్టతలపై వెంట్రుకలు మొలిపించమంటున్నాడు. సామాన్య భావం. కానీ 'కోయల్' అని రాగం తీసినప్పుడు పాటలో 'కూ' అన్నది హాస్యంగానే అయినా, కళ్లు మూసుకుని వింటే నిజంగా మనస్సులో కోయిల స్వరం ధ్వనిస్తూంది. అద్భుతమైన సంగీతం. గానం. శాస్త్రీయ సంగీతంలోని రాగాలలోని గాంభీర్యాన్ని వదలి వాటినుంచి అద్భుతంగా హాస్యం పండించిన పాట మరొకటి లేదు. పాటను ఊహించిన రాజ్‌కపూర్, అతడి ఊహకు రూపకల్పన చేసిన సంగీత దర్శకుడు, ఇందులో ఏ ఒక్కరు తమ బాధ్యత సరిగ్గా నిర్వహించకపోయినా ఈ పాట ఇంత గొప్పగా ఎదిగేదికాదు.

ఈ పాట ప్రేరణతో ఎస్డీ బర్మన్ 'మునింజీ' సినిమాలో కాఫీ రాగం ఆధారంగా ఒక అద్భుతమైన పాటను సృజించాడు. అయితే ఆరంభం నుంచీ హాస్యం సృష్టించాలన్న ఉద్దేశ్యంతో పాటను రూపొందించటం, సరైన సన్నివేశాల్ని సృజించక పోవటం, హాస్యం కోసం వాడిన అంశాలు పాటను బలహీనం చేశాయి. 'లపక్ ఝపక్ ' హాస్యం సృజించటం కొసమే రూపొందించిన పాట అయినా నటీనటులు కానీ గాయకుడు కానీ ఎక్కడా తాము హాస్యం సృష్టిస్తున్నామన్న భావనను కనిపించనీయరు. నిజాయితీగా కర్తవ్యాన్ని నిర్వహించటం వల్ల హాస్యం పండింది. 'ఘాయల్ హిరణియా' పాట ఆరంభమే 'హాస్యం' తెలిసిపోతుంది. నాయిక నాయకుడి కోసం అడవిలో ఎదురు చూస్తుంది. పలురకాల జంతువులును చూస్తుంది. కోతులు, నెమళ్లు వంటివి. వాటి కదలికతో ప్రిల్యూడ్ సంగీతం మొదలవుతుంది. ఇంతలో నాయిక కొంగును ఎవరో లాగుతారు. ఆమె కళ్లల్లో భయం. అప్రయత్నంగా రాగాలాపన ఆరంభమవుతుంది. లత స్వరం అద్భుతంగా పలుకుతుంది. నళినీ జయవంత్ పెద్ద పెద్ద కళ్లతో అందంగా అనిపిస్తుంది. కానీ హాస్యం విరుగుతుంది.

**'డర్ లగేతో గానాగా**

**ఐసే భీ, వైసీభీ '**

'యార్ మెరే ' సినిమాలో రఫీ 'భయం కలిగితే ఎలాగైనా పాటపాడమన్నాడు. బాగుంది. కానీ నిజంగా భయం కలిగినప్పుడు పాట పాడితే హాస్యం అపహాస్యం అవుతుంది. శైలేంద్ర అలవాటైన రీతిలో చక్కని గీతం రాశాడు.

ఘాయల్ హిరణియా మై బన్ బన్ డోలూ

కిస్‌కా లగా బాణ్, ముఖ్‌సే న బోలూ...

గాయపడిన లేడిలా వనమంతా తిరుగుతాను. ఎవరి బాణం గాయం చేసిందో చెప్పను అంటోంది నాయిక. పాటలో పదాలలో ఎక్కడా హాస్యంలేదు. చిత్రీకరణలో హాస్యం సృజించాలని ప్రయత్నించినా, పాటలో మాధుర్యం, పదాలలో లాలిత్యం, లతా స్వరంలోని పవిత్రత హాస్యాన్ని దరిదాపులకు రానీయవు. చరణం అద్భుతంగా ఉంటుంది.

**ముడ్ కే జొ దేఖా బచ్‌పన్ బులాయే,**

**పల్కోంమె లేకిన్ కోయీ ముస్కురాయే**

**జీకో దుఖా వూ కె పీ సంగ్ హోయీ...**

వెనక్కి తిరిగి చూస్తే బాల్యం పిలుస్తున్నది. నళినీ జయవంత్ అందంగా కనిపిస్తుంది. చక్కగా భావాలు ప్రదర్శిస్తుంది. ఆమెను ఓ వైపు బాల్యం పిలుస్తూంటే, కను రెప్పల పైన ఎవరో నవ్వుతున్నారట. ఆ నవ్వేది యవ్వనమా? ప్రియుడా? బాల్యం వైపు వెళ్లకపోతే హృదయం బాధపడుతుంది. కానీ ప్రియుడి వైపు వెళ్లమంటోంది మనస్సు. కాబట్టి దెబ్బతిన్న లేడిలా వనంలో తిరుగుతోంది. ఆ గాయం చేసింది ప్రియుడా? యవ్వనమా? ఇంతలో తాము హాస్యం సృష్టించాలని గుర్తుకు వచ్చి నాయిక ముందుకు ఓ పాముని విసిరేశారు. అది చూసి ఆమె స్వరాలు పలుకుతూ, అద్భుతమైన హర్కత్‌లు లత స్వరంలో పలికిస్తుంది. 'పపని పప పపరే ' అంటూ 'మ ప స్స స స స స గ రెస గరి స ' అనటంలో లత అద్భుతమైన గానసంవిధానం తెలుస్తుంది. స్వరాలతో ఆడుకోవటం ద్వారా హాస్యం సృష్టించాలన్న తపన తెలుస్తుంది. కానీ 'అద్భుతం ' అనిపిస్తుంది తప్ప హాస్యం కలగదు. రెండో చరణం తరువాత పులి వస్తుంది. అప్పుడు బన్..బన్.. అని వణుకుతూ పాడటం, ననన అంటూ పరుగులు తీయటం 'హాస్యం ' కలిగించదు. కానీ అద్భుతమైన గాన సంవిధానం అనిపిస్తుంది. లతపై గౌరవం ప్రేమలా మారుతుంది. ఈ పాట 'అపహాస్యం' పాలవటంలో దృశ్యం ప్రధాన పాత్ర వహిస్తుంది. నిజానికి సినిమాలో కూడా ఈ దృశ్యం అంతగా అతకదు. పైగా పులి వెంట పడితే 'ననన' అంటూ పరుగెత్తటం నచ్చదు. దాంతో పాట బాగుంటుంది. పాడిన విధానం బాగుంటుంది. రచన బాగుంది. బాణీ బాగుంది. నాయిక అందంగా ఉంది. కానీ పాట ఆశించిన ఫలితం ఇవ్వదు. అందుకే హాస్యం సృష్టించటం అంత సులభమైన పని కాదు. humour is a seriouns business అంటారు. హాస్యం కొన్ని విధాలుగానే పండుతుంది. ఏమాత్రం అటూ ఇటూ అయినా అది అపహాస్యం అవుతుంది.

**'ప్యార్ కే ఆగ్‌మె, తన్ బబదన్ జల్ గయా**

**జానె ఫిర్ క్యూ జలాతీ హై దునియా ముఝే'**

'జిద్దీ' సినిమాలో మన్నాడే దర్బారీ కానడ రాగంలో పాడిన అపహాస్యంగా అనిపించే హాస్యగీతం ఇది. మహమూద్ హాస్యనటుడు. అతడిని చూస్తేనే ప్రజలు విరగబడి నవ్వుతారు. అతడికి ఓ పాట తప్పనిసరి. సినిమాలో అవసరం ఉన్నా, లేకున్నా 'జిద్దీ' సినిమాలో అతడో అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలనుకుంటాడు. పెళ్ళి పీటలమీద చొక్కా చించుకుంటూ వెర్రి వేషాలు వేస్తూ వెకిలిగా అనిపించే ఏడుపుతో మన్నాడే అద్భుతంగా పాడిన పాట పాడతాడు. మన్నాడే పాడిన విధానంలో లోపంలేదు. మహమూద్ వెర్రి నటనలో దోషం లేదు. ఎస్డీ బర్మన్ బాణీ, దర్బారీ కానడ రాగంలో రూపొందించడంలో లోపంలేదు. అయితే ఆ రాగంలోని గాంభీర్యాన్ని ఎస్డీ బర్మన్ పూర్తిగా తొలగించలేకపోయాడు. దీనికి తోడు పాటకోసం సృజించిన సందర్భం విషాదకరమైనది. పెళ్లి పీటలమీద ఆగిపోవటం ఒక దౌర్భాగ్యం. దుర్భరమైన వేదన. ఆ సమయంలో చొక్కా చించుకుని ఏడవటం ద్వార హాస్యాన్ని పిండుకోవాలని ప్రయత్నించటం ఒక గొప్ప విషాదం. ప్రేమాగ్ని లో అతని శరీరం కాలింది. అయినా ప్రపంచం అతడిని సతాయిస్తూనే వుంది. దుర్భరం. అది ఈ పాటను దెబ్బ తీసింది. ఇలాంటి విఫల ప్రయత్నాలు ఎన్నో ఉన్నాయి. అంటే, హాస్యం సృష్టించాలంటే, వెర్రి వేషాలు, పిచ్చి మాటలు సరిపోవు. చాలా నిజాయితీగా, సీరియస్‌గా శ్రమ పడాల్సి ఉంటుంది. హాస్యం సృష్టిస్తున్నామన్న స్పృహ'తో కాక నిజాయితీగా హస్య సృజన కోసం తపించాల్సి ఉంటుంది. అప్పుడే అందరూ మెచ్చి చిరకాలం గుర్తుంచుకుని హాస్యం సృజితమవుతుంది.

హాస్యాన్ని వెన్నంటి విషాదం ఉంటే హాస్యం విలువ పెరుగుతుంది. లపక్ ఝుపక్ అంటూ అద్భుతంగా పాడి బర్సో బర్సో అంటూవర్షించమని మేఘాలను గొంతుచించుకుని అభ్యర్ధించిన తరువాత పెద్ద వర్షం పడుతుంది. వర్షంతో వరదలొస్తాయి. ఆ వరదలో పిల్లలు తలదాచుకున్న ఆశ్రయం కొట్టుకుపోతుంది....సినిమా కథ నడుస్తుంది...ఇదీ అత్యద్భుతమయిన సృజనాత్మకతకు తిరుగులేని నిదర్శనం. స్క్రిప్ట్ లో పాటను ఒదిగించి, కథను ముందుకు నడపటానికి చక్కని పాఠం.

'లపక్ ఝుపక్' ప్రేరణతో తరువాత ఎందరో ఎన్నో రకాలుగా శాస్త్రీయ సంగీతం ద్వార హాస్యం సృష్టించాలని ప్రయత్నించి అపహాస్యం పాలయ్యారు. మళ్లీ 'లపక్ ఝుపక్' స్థాయిలో, అంతగొప్పగా కాకపోయినా అందరూ పదే పదే విని చూసి ఆనందించేలా హాస్యం సృష్టించిన పాట 'పడోసన్' సినిమాలో మన్నాడే, కిషోర్ కుమార్, రాజిందర్ క్రిషన్, ఆర్డీ బర్మన్‌ల సంయుక్త శ్రమ ఫలితంగా రూపొందిన 'ఎక్ చతుర్ నార్ కర్ కే సింగార్.

## 'ఇది వచ్చే నెల'

Post your comments